teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

## నిజజీవితంలో ఓ బాలుడు సాహసాన్ని అభినందించిన సీఎం

### పుష్ప గుచ్ఛం అందించి శాలువతో బాలుడికి సన్మానం



హైదరాబాద్, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): సినిమాల్లో మాత్రమే హీరో ఆపదలో ఉన్న వారిని రక్షిస్తూ ఉండడం చూస్తూ ఉంటాం. కానీ నిజజీవితంలో ఓ బాలుడు చేసిన

మిగతా 2 లో

ములుగు | సంపుటి : 02 | సంచిక : 356 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | సోమవారం | 29 ఏప్రిల్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.



## రాజీనామాతో రేవంత్ రాలేదేం

**నాడు ఓటుకు నోటు.. నేడు ఓటుకు ఒట్టు నినాదంతో రేవంత్**

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేసుడు కాదు, ఆరు గ్యారెంటీలను టచ్ చేయ్**

**సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత హరీష్ వాఖ్యలు**

సిద్దిపేట, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను టచ్ చేసుడు కాదు, ఆరు గ్యారెంటీలను టచ్ చేసి ప్రజలకు అందించాలని సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. నాడు ఓటుకు నోటు.. నేడు ఓటుకు ఒట్టు నినాదంతో ప్రజలను మభ్యపెడుతున్నారని

మిగతా 2 లో



# ఖమ్మం కాంగ్రెస్‌లో అసంతృప్తి రాగాలు

ఖమ్మం రాజకీయ చైతన్యానికి ప్రతిరూపం. సాయుధ పోరు నుంచి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వరకు అన్ని ప్రజాపోరాటాల్లోనూ ఇక్కడి ప్రజలు కీలకభూమిక పోషించారు. రాజకీయంగా అత్యంత చైతన్యవంతమైన ఈ జిల్లాలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రతిష్టాత్మకమే. ముఖ్యంగా ఖమ్మం ఎంపీ స్థానం పోరు రాష్ట్రస్థాయిలో ప్రాధాన్యత సంతరించుకుంటుంది. తెలంగాణలోని అన్ని పార్లమెంటు స్థానాల పరిస్థితి ఒక ఎత్తయితే ఖమ్మంది మరో ఎత్తు. మహామహులు బరిలో ఉండే ఈ స్థానంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులెలా ఉన్నాయో ఒక్కసారి పరికిద్దాం.

### టికెట్ ఆశించి భంగపడ్డ నేతల్లో నెలకొన్న భగ్గుమన్న అంసతృప్తి

**ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలా.. వద్దా.. ఆలోచనలో నేతలు**

**అసంతృప్తి నేతల బుజ్జగింపు పనిలో పార్టీ నేతలు**




ఖమ్మం, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): ఖమ్మం లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ తరపున పోటీ చేసేందుకు ఆ పార్టీ నుంచి అనేకమంది నేతలు దరఖాస్తు చేసుకున్నారు. 25 రోజులపాటు వీరి మధ్య దోబూచులాడిన అభ్యర్థిత్వం ఎట్టకేలకు ఖరారైంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వియ్యంకుడు రఘురాంరెడ్డిని ఖమ్మం లోక్‌సభ అభ్యర్థిగా ఆ పార్టీ ప్రకటించింది. దీంతో టికెట్ ఆశించి భంగపడిన నేతల్లో నెలకొన్న అంసతృప్తి ఒక్కసారిగా భగ్గుమన్నది. కాంగ్రెస్

మిగతా 2 లో

## వివాదాల్లో చిక్కుకుంటున్న రాష్ట్ర పోలీసులు

### సొంత లాభం కోసం తమ అధికారాల దుర్వినియోగం




**పోలీసు శాఖ ప్రతిష్టకు భంగం**

**సివిల్ వివాదాల్లో పోలీసుల జోక్యం**

**ఖాకీ డ్రెస్సుల్లో కొందరు దౌర్జన్యాలు, దందాలు చేస్తున్నారనే ఆరోపణలు**

**అసభ్య ప్రవర్తనతో హెడ్ ఎస్ఐ పై కేసు నమోదు**

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): క్రమశిక్షణకు మారుపేరుగా ఉండాల్సిన పోలీసులు గీత తప్పుతున్నారు. అనేకసార్లు పరిధిదాటి ప్రవర్తిస్తున్నారు. సొంత లాభం కోసం తమ అధికారాలను దుర్వినియోగం చేస్తున్నారు. మహిళలతోనూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. రకరకాల కారణాలతో వివిధ హోదాల్లో ఉన్న పోలీసులు వివాదాల్లో చిక్కుకుంటున్నారు. పోలీసు శాఖ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారు. దీంతో నేరాలను అరికట్టాల్సిన రక్షక

మిగతా 2 లో

## ఎన్నికల వేళ రాష్ట్రంలో రిజర్వేషన్ల పంచాయతీ

**కాంగ్రెస్, బీజేపీ పార్టీల నడుమ రాజకుంటున్న నిప్పు**

**బీజేపీని గెలిపిస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారంటూ సీఎం రేవంత్ వాఖ్యలు**

**రేవంత్‌కు ఎంపీ బండి సంజయ్ ఓ రేంజ్‌లో కౌంటర్**

2



## మెట్రో ఫేజ్-2కి పై వచ్చిన క్లారిటీ

**నాగోల్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు నిర్మించనున్న మెట్రో మార్గం**

**13 మెట్రో స్టేషన్లు అందుబాటులోకి రాబోతున్నట్లు మెట్రో ఎండీ ప్రకటన**

హైదరాబాద్, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ ప్రజలకు మెట్రో గుడ్ న్యూస్ చెప్పింది. మెట్రో ఫేజ్-2కి సంబంధించి క్లారిటీ వచ్చేసింది. ఇందులో భాగంగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మార్గంలో కొత్తగా మెట్రో స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మార్గంలో నాగోల్ నుంచి

మిగతా 2 లో

## శ్రీరాముడు బీజేపీ ఎంపీనా.. లేక బీజేపీ ఎమ్మెల్యేనా

**రాముడిని దేశానికి పరిచయం చేసినట్లుగా బీజేపీ నేతలు ప్రచారం**

**బీజేపీపై ధ్వజమేత్తిన బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**




తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలు జరుగుతుండటంతో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు గుప్పించుకుంటున్నారు. మరోసారి బీజేపీ, కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర విమర్శలు గుప్పించారు. దేవుడైనా రాముడిని బీజేపీ నేతలు రాజకీయాల్లోకి తీసుకొచ్చి లబ్ధి పొందేలా ప్లాన్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతి దానికి రాముడిని తెరమీదకు తీసుకువస్తున్నారని చెప్పారు. రాముడు ఏమైనా

మిగతా 2 లో

## కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు జైలుకెళ్లడం ఖాయం

### ఎమ్మెల్యే, పార్లమెంట్ ఇంచార్జ్ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి




తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్టు, ధరణి, అవినీతి, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో త్వరలోనే కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు జైలుకెళ్లడం ఖాయమని మునుగోడు ఎమ్మెల్యే భువనగిరి పార్లమెంట్ ఇంచార్జ్ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో చౌటుప్పల్ మున్సిపాలిటీకి చెందిన ఆరుగురు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, నారాయణపురం బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కత్తుల లక్ష్మయ్య, పుట్టపాక సర్పంచ్ భాస్కర్ వారి అనుచరులు భారీ సంఖ్యలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ కు ప్రజలు మూకుమ్మడిగా ఓటేసి కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకొచ్చారని

మిగతా 2 లో

## మేడిగడ్డ బ్యారేజ్ బ్లాక్‌ను అలా వదిలేస్తే ఎలా

**ప్రాణహితకు ఇన్‌ఫ్లో వచ్చే అవకాశం.. తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం**


**జ్యుడీషియల్ విచారణ కమిటీ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్**





హైదరాబాద్, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్టులో కుంగుబాటుకు గురైన మేడిగడ్డ బ్యారేజ్ బ్లాక్‌ను అలా వదిలేస్తే ఎలా.. అని జ్యుడీషియల్ విచారణ కమిటీ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ అభిప్రాయపడినట్టు విశ్వసనీయంగా తెలిసింది. జూన్ నెలలోనే ప్రాణహితకు ఇన్‌ఫ్లో వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో బరాజ్‌లో తదుపరి నష్టం జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టంచేశారు. ఈ మేరకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ)కి లేఖ రాసి, తక్షణం చేపట్టాల్సిన మరమ్మతులు, చర్యలపై మధ్యంతర నివేదిక తెప్పించుకోవాలని సూచించారు. అదేవిధంగా అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై కూడా నివేదిక

మిగతా 2 లో




## ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీకి పరీక్షల తేదీల్లో మార్పులు

### మే 24 నుండి జూన్ 3 వరకు నిర్వహించనున్నట్లు బోర్డు ప్రకటన

హైదరాబాద్, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీకి సంబంధించి తెలంగాణ ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష తేదీల్లో మార్పు చేసింది. సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 3 వరకు నిర్వహించనున్నట్లు తెలిపింది. అయితే ఇంతకు ముందు మే 24 నుంచి జూన్ 1 వరకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయని

మిగతా 2 లో

## బంగారు తెలంగాణ అన్నాడు.. నిరుద్యోగ తెలంగాణ చేశాడు

**పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వలేదు**

**కానీ తను మాత్రం వందల ఎకరాల్లో ఫాంహౌస్ కట్టుకున్నాడు**

**బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల ద్రోహి**

**కెసిఆర్ పై పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ తీవ్ర విమర్శలు**



జగిత్యాల, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మారుస్తానని నిరుద్యోగ తెలంగాణ చేశాడని ఆయన మండిపడ్డారు. ఏప్రిల్ 28వ తేదీ ఆదివారం ధర్మపురి నియోజకవర్గంలోని బుగ్గారం మండల కేంద్రంలో

మిగతా 2 లో

## ఎన్నికల వేళ రాష్ట్రంలో రిజర్వేషన్ల పంచాయతీ

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): లోక్‌సభ ఎన్నికల వేళ తెలంగాణ గడ్డ మీద రిజర్వేషన్ల పంచాయతీ ఓ రేంజ్‌లో కొనసాగుతోంది. ఈ విషయంలో రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల నడుమ నిప్పు రాజేస్తోంది. పొరపాటున బీజేపీని గెలిపిస్తే.. రిజర్వేషన్లు రద్దు చేస్తారంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో చేస్తున్న వ్యాఖ్యలు ఇప్పుడు స్టేట్ పాలిటిక్స్‌లో చర్చనీయాంశంగా మారాయి. ఈ క్రమంలోనే రేవంత్‌కు ఎంపీ బండి సంజయ్ ఓ రేంజ్‌లో కౌంటర్ ఇచ్చారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ రిజర్వేషన్లపై మాట్లాడుతోందని ధ్వజమెత్తారు. ఎలాంటి రిజర్వేషన్ల రద్దు ఉండబోదని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ మరోసారి నీచ రాజకీయాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని మతాలను గౌరవించే పార్టీ కేవలం బీజేపీయేనని అన్నారు. హస్తం పార్టీ ఓ ప్లాన్ ప్రకారంగా ముందుకు వెళ్తోందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా రెండు దశల్లో పోలింగ్ ప్రక్రియ పూర్తైందని, ఎక్కడ చూసినా బీజేపీ అనుకూల వాతావరణం ఉండటం కాంగ్రెస్‌కు సీట్లు వచ్చే పరిస్థితి లేకపోవడంతో రేవంత్ రిజర్వేషన్ల రాగం అందుకున్నాడని ఫైర్ అయ్యారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ ఆడుతున్న నాటకాలేనని బండి సంజయ్ కొట్టిపడేశారు.

## రాజీనామాతో రేవంత్ రాలేదేం

### మొదటి పేజీ తరువాయి

మండిపడ్డారు. సిద్దిపేట, కరీంనగర్‌లలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 15లోగా రుణమాఫీతో పాటు ఆరు గ్యారెంటీలను రేవంత్ రెడ్డి అమలు చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్న తన సవాల్‌కు కట్టుబడి ఉన్నానని చెప్పారు. రాజీనామా లేఖతో తాను గన్‌పార్కు వద్దకు వెళ్తే, అక్కడకు రాకుండా సీఎం రేవంత్ రెడ్డి డొంకతిరుగుడు మాటలు చెబుతున్నారని విమర్శించారు. సరైన పద్ధతిలోనే స్పీకర్ ఫార్మాట్‌లో తన రాజీనామా పత్రం ఉందని చెప్పారు. రేవంత్ రెడ్డి మాటల్లో ఓటమి భయం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. కొత్త జిల్లాల రద్దుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచిస్తోందని, ఇందులో మొదటగా సిద్దిపేట జిల్లాను తొలగించాలని రేవంత్ రెడ్డి చూస్తున్నారని, జిల్లాల రద్దుపై కాంగ్రెస్ సర్కారు వెనక్కి తగ్గకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు

## మెట్రో ఫేజ్-2కి పై వచ్చిన క్లారిటీ

### మొదటి పేజీ తరువాయి

చాంద్రాయణగుట్ట వరకు 14 కి.మీ మెట్రో మార్గాన్ని నిర్మించనున్నారు. ఇందులో భాగంగానే కొత్తగా 13 మెట్రో స్టేషన్లు అందుబాటులోకి రాబోతున్నాయని హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

ప్రస్తుతం ఉన్న నాగోల్ స్టేషన్ సమీపంలో మొదటి స్టేషన్‌తో ప్రారంభమై ఆ తర్వాత నాగోల్ చౌరస్తా, అల్కాపురి చౌరస్తా, కామినేని ఆసుపత్రి, ఎల్బీనగర్ కూడలి, సాగర్ రింగ్‌రోడ్డు, మైత్రీనగర్, కర్మన్‌ఘాట్, చంపాపేట రోడ్ కూడలి, ఒవైసీ ఆసుపత్రి, డీఆర్‌డీవో, హాఫీజ్ బాబానగర్, చాంద్రాయణగుట్ట ప్రాంతాల్లో కొత్త మెట్రో స్టేషన్లు రాబోతున్నాయని పేర్కొన్నారు. ఈ రూట్‌లో మెట్రోరైలు ఎలైన్‌మెంట్, స్టేషన్ల స్థానాలను ఖరారు చేసేందుకు ఆయన అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాగోల్ నుంచి చంద్రాయణగుట్ట వరకు కొన్ని ఫ్లైఓవర్ల వల్ల స్టేషన్ల కోసం భూసేకరణ అనివార్యంగా మారిందని అధికారులు నివేదించారు. ప్రైవేటు ఆస్తులు కనిష్ఠంగా సేకరించేందుకు ప్రణాళికలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అలాగే మెట్రో రైలు స్టేషన్లకు సంబంధించి వాటి పేర్ల ఖరారుకు ట్రాఫిక్ పోలీసులు, సాధారణ ప్రజల నుంచి సలహాలు స్వీకరించాలని సూచనలు చేశారు. ఫేజు -2 లోభాగంగా చేపడుతున్న మార్గంలో భాగంగా ఈ స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. దీని ద్వారా నగరంలోని ప్రయాణీకులకు వెసులుబాటు కలగనుంది.

## మేడిగడ్డ బ్యారేజ్ బ్లాక్‌ను అలా వదిలేస్తే ఎలా

### మొదటి పేజీ తరువాయి

తెప్పించుకోవాలని సూచించినట్టు తెలిసింది. మేడిగడ్డ బరాజ్ ఏడో బ్లాక్‌లో మూడు పిల్లర్లు కుంగిన విషయం తెలిసిందే. దీనిపై ఎన్డీఎస్ఏ కమిటీ పలు దఫాలుగా క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. ఈ కమిటీ నివేదిక సమర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలల గడువు ఇచ్చింది. అయితే, జూన్‌లోనే వరదలు వచ్చే అవకాశం ఉండటంతో బరాజ్‌కు మరింత నష్టం జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని నిపుణులు గతంలోనే సూచించారు. నీటిపారుదల శాఖ ఇంజినీర్లు సైతం తక్షణ చర్యలపై ఎన్డీఎస్ఏకు నివేదిక కూడా ఇచ్చారు. కానీ, ఎన్డీఎస్ఏ నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక అందలేదు. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం కూడా 'ఎన్డీఎస్ఏ నివేదిక వచ్చే వరకు వేచిచూద్దాం' అన్నట్టుగా వ్యవహరిస్తున్నది. దీంతో మధ్యంతర నివేదిక కోసం ఎన్డీఎస్ఏపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయడం లేదనే విమర్శలొస్తున్నాయి. రెండు, మూడురోజుల్లో ఎన్డీఎస్ఏ నివేదిక రాబోతున్నదని ఇటీవల నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించినా అలాంటిదేమీ రాలేదు. ఈ నేపథ్యంలో ఎన్డీఎస్ఏ మధ్యంతర నివేదికను వెంటనే తెప్పించుకోవాలని ప్రభుత్వానికి జస్టిస్ పినాకి చంద్రఘోష్ సూచించడం ప్రాధాన్యం సంతరించుకున్నది. బరాజ్‌కు మరింత నష్టం జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆది నుంచీ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూనే ఉన్నారు. అదే తరహాలో తాజాగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కూడా నీటి పారుదల శాఖను ఆదేశించడం విశేషం. కాళేశ్వరంపై జ్యుడీషియల్ విచారణ చేపట్టిన ఘోష్.. శనివారం కోల్‌కతాకు వెళ్లేముందు అధికారులతో సమావేశమయ్యారు. మే నెలాఖరున లేదా జూన్‌లో గోదావరికి వరదలు రానున్న నేపథ్యంలో బరాజ్‌లు మరింత దెబ్బతినకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. దీనికోసం అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీ నివేదికను తెప్పించుకోవడానికి వీలుగా కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్‌కు లేఖ రాయాలని నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను ఆదేశించారు. ఆ నివేదికను వెనువెంటనే తెప్పించుకొని, దాని ఆధారంగా బరాజ్‌ల రక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విచారణలో ఎన్సీఎస్ఏ నివేదిక కూడా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. తదనంతరం హైదరాబాద్‌కు చేరుకొని.. కాగ్ నివేదికతోపాటు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మధ్యంతర నివేదిక, ఎన్డీఎస్ఏ నివేదికలపై అధ్యయనం చేసే అవకాశాలున్నాయి.

## ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీకి పరీక్షల తేదీల్లో మార్పులు

### మొదటి పేజీ తరువాయి

ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే మే 27న ఖమ్మం-వరంగల్-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ఉంది. దీంతో పరీక్ష తేదీల్లో మార్పు చేశారు. అడ్వాన్స్ సప్లమెంటరీలో పరీక్షలు మొదటి సంవత్సరం, రెండో సంవత్సరం విద్యార్థులకు ఒకే రోజు నిర్వహించనున్నారు. ఉదయం మొదటి సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం రెండో సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ఉంటాయి. ఫస్ట్ ఇయర్ వారికి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండ్ ఇయిర్ వారికి మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. సప్లిమెంటరీ, ఇంప్రూమెంట్ రాసే విద్యార్థులు మే 2 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలి. ఏప్రిల్ 24న ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం ఫలితాలు విడుదలయ్యాయి. ఇంటర్ లో గతం కంటే ఉత్తీర్ణత శాతం తగ్గింది. మొదటి సంవత్సరం ఫలితాల్లో రంగారెడ్డి జిల్ల తొలి స్థానంలో నిలిచింది. సెకండ్ ఇయర్ ఫలితాల్లో మలుగు జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. ఏప్రిల్ 30 పదో తరగతి ఫలితాలు ప్రకటించనున్నారు.

## శ్రీరాముడు బీజేపీ ఎంపీనా.. లేక బీజేపీ ఎమ్మెల్యేనా




### మొదటి పేజీ తరువాయి

బీజేపీ ఎంపీనా, లేక బీజేపీ ఎమ్మెల్యేనా అని సూటిగా బీజేపీ నేతలను కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. రాముడు అందరికీ దేవుడేనని స్పష్టం చేశారు. రాముడిని దేశానికి బీజేపీనే పరిచయం చేసినట్లుగా ఆ పార్టీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ లేకపోతే బొట్టే పెట్టుకోలేము అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. బీజేపీ ఉన్నా దేవుడు ఉంటాడని బీజేపీ లేకపోయిన దేవుడు ఉంటాడని తేల్చిచెప్పారు. ఆదివారం కరీంనగర్‌లో కేటీఆర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్‌ని గెలిపించాలని అభ్యర్థించారు. కరీంనగర్‌లో బండి సంజయ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని ఆరోపించారు. డమ్మీ క్యాండిడేట్‌ను పెట్టి సంజయ్‌ను మరోసారి ఎంపీగా గెలిపించాలని చూస్తున్నారని విమర్శించారు. కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో ఎవరికీ తెలియదని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలమైన అభ్యర్థిని పెడితే బీఆర్ఎస్ గెలుస్తుందని రేవంత్ భయపడ్డారన్నారు. రేవంత్ రెడ్డి సీఎం ఆ లేక బోటీ కొట్టేటోడా. పేగులు మెడలో వేసుకోవడం ఏందీ అని ప్రశ్నించారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి కేంద్రం నుంచి ఒక్క రూపాయి అయినా బండి సంజయ్ తెచ్చారా అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు.

## కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు జైలుకెళ్లడం ఖాయం

### మొదటి పేజీ తరువాయి

అన్నారు. తెలంగాణ వస్తే తమ బతుకులు మారుతాయని ఎదురుచూసిన ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం నిరాశే కల్పించిందని ఆయన అన్నారు. కేసీఆర్ తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ అప్పుల ఊబిలో చిక్కుకుందని మండిపడ్డారు. మునుగోడు ఉప ఎన్నికల నుంచి మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఫోన్లు ట్యాపింగ్ లు చేసి పోలీస్ వాహనాల్లో డబ్బులు తరలించి బీఆర్ఎస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని అన్నారు. ఇప్పుడు జరగబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఒక్క స్థానంలో కూడా గెలిచే పరిస్థితి లేదని, కాంగ్రెస్ కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, కనీసం 14 సీట్లు కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాల్లో ఎంత పెద్ద మనుషులు ఉన్నా శిక్ష తప్పదని హెచ్చరించారు. చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎన్ఎస్యుఐ, యూత్ కాంగ్రెస్ లో నుండి పార్టీలో కీలకంగా పనిచేశాడని అతనని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# ఖమ్మం కాంగ్రెస్‌లో అసంతృప్తి రాగాలు

### మొదటి పేజీ తరువాయి

అభ్యర్థిత్వాన్ని ఆశించిన మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు అనుచరులు శుక్రవారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలో సమావేశమై పోట్లకు టికెట్ ఇవ్వకపోవడంపై తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు. జిల్లాలో బలమైన సామాజికవర్గానికి చెందిన పోట్ల నాగేశ్వరరావు కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలవాలని ఆయన అనుచరుల నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిడి వస్తున్నట్టు సమాచారం. 17 లోక్‌సభ స్థానాల్లో ఒక్క స్థానాన్ని కూడా కమ్మ సామాజికవర్గానికి కేటాయించలేదని చర్చించుకున్నారు. ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిగా రఘురాంరెడ్డిని పార్టీ ఖరారు చేసిన తర్వాత ఈ నెల 25న ఆయన నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి దరఖాస్తు చేసిన పొంగులేటి ప్రసాదరెడ్డి మినహా ఏ ఒక్కరూ హాజరు కాలేదు. ఉప ముఖ్యమంత్రి మల్లు కూడా గైర్హాజరవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సీనియర్ నేతలు పార్టీ ఇచ్చే ప్రాధాన్యాన్ని బట్టి



ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలా? వద్దా? అని భావిస్తున్నట్టు సమాచారం.

అసంతృప్తులకు నేతల బుజ్జగింపులు

ఎన్నికలు సమీపిస్తుండటంతో కాంగ్రెస్‌లోని అసంతృప్తులను బుజ్జగించేందుకు పార్టీ ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అభ్యర్థి రఘురాంరెడ్డి రంగంలోకి దిగారు. నామినేషన్ల ఉపసంహరణకు సోమవారం చివరిరోజు కావడంతో రెబల్ నామినేషన్లను ఉపసంహరింపజేసేందుకు కాంగ్రెస్ నేతలు పోట్ల నాగేశ్వరరావు, యాదయ్యలతో మంతనాలు జరుపుతున్నారు.

## వివాదాల్లో చిక్కుకుంటున్న రాష్ట్ర పోలీసులు

### మొదటి పేజీ తరువాయి

భటులే నిందితులుగా మారుతున్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు ఇలాంటి ఘటనల్లో పోలీసులపై పోలీసులే కేసులు నమోదు చేస్తున్నారు. కాగా, ఇందులో కొందరు సస్పెన్షన్లు, శాఖాపరమైన చర్యలను ఎదుర్కొంటుండగా మరికొందరు తమ పలుకుబడి ఉపయోగించి చర్యలకు చిక్కకుండా తప్పించుకుంటున్నారనే చర్చ జరుగుతున్నది.




#### అసభ్య ప్రవర్తనతో

ఆదిలాబాద్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్‌గా తనతో అసభ్యంగా ప్రవర్తించాడని ఓ మహిళ ఫిర్యాదు చేయడంతో ఇటీవల మావల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గతంలో ఇందల్వాయిలో ఎస్ఐగా పనిచేసిన ఓ అధికారిపై అదే పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ బుక్ చేశారు. పెండ్లయి, భార్యతో విడాకులు తీసుకున్నా, ఆ విషయాలను గోప్యంగా ఉంచి తనతో సన్నిహితంగా ఉన్నాడని ఓ యువతి అతడిపై ఫిర్యాదు చేసింది. అలాగే నిజామాబాద్ మండలంలోని ఓ గ్రామంలో నిందితురాలికి కోర్టు సమన్లు ఇవ్వడానికి వెళ్లిన రూరల్ ఠాణా కానిస్టేబుల్ 15 ఏండ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడనే ఫిర్యాదుతో అతడ్ని సస్పెండ్ చేశారు. అలాగే భూపాలపల్లి జిల్లా వీఆర్‌లో సీఐగా ఉన్న ఓ అధికారి లైంగిక ఆరోపణల్లో పోక్సో చట్టం కింద కేసు నమోదై కటకటాల్లోకి వెళ్లారు. మహిళపై అత్యాచారం చేసిన కేసులో టాస్క్ ఫోర్స్‌లో పనిచేసిన ఇన్స్‌పెక్టర్ సైతం సస్పెన్షన్ వేటుకు గురయ్యారు.

#### సివిల్ వివాదాల్లోనూ

మరోవైపు సివిల్ వివాదాల్లో పోలీసులు జోక్యం చేసుకోకూడదని కోర్టుల నుంచి స్పష్టమైన ఆదేశాలున్నా కొందరి ఖాకీల తీరు మారడం లేదు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఓ హెడ్ కానిస్టేబుల్ స్థల వివాదం కేసులో ఆయనకు మద్దతుగా పోలీసు ఉన్నతాధికారులు సైతం సివిల్ మ్యాటర్స్‌లో జోక్యం చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఇతరుల స్థలాన్ని కబ్జా చేసి బౌండరీ కట్టుకున్నాడని, స్థల వివాదంపై విచారణ చేపట్టడానికి వచ్చిన మున్సిపల్ అధికారులతో దురుసుగా ప్రవర్తించడమే కాకుండా సిబ్బంది విధులకు ఆటంకం కలిగించాడని మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు చేయడంతో సదరు హెడ్ కానిస్టేబుల్‌పై ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గతంలో రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడుల విషయంలో వచ్చిన వివాదంలో చిక్కడపల్లి మాజీ డీఐ (డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్) పై కేసు నమోదైంది.

రూ. 100 కోట్ల విలువైన భూమిని కొట్టేసేందుకు విశ్రాంత ఉద్యోగిపై మేడ్చల్‌కు చెందిన ఓ ఎస్ఐ విష ప్రయోగం చేయడం సంచలనం సృష్టించింది. 2023లో కేవలం హైదరాబాద్ పరిధిలోనే 50 మంది పోలీసులు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఒకరిని డిస్మిస్ చేశారు.


#### ఇంకా అనేక వివాదాల్లో

స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ)లో ఏఎస్ఐగా పనిచేసే ఓ వ్యక్తి బోగస్ పాస్ పోర్టులు జారీ అయ్యేందుకు సహకరించాడని హైదరాబాద్ సీఐడీ ఆఫీసర్లు అతడిని అరెస్ట్ చేశారు. నకిలీ అడ్రస్‌లతో పాస్-పోర్టుల కోసం అప్లికేషన్లు పెట్టుకున్న వారికి హెల్ప్ చేశాడన్నది ఆయనపై అభియోగం. హైదరాబాద్ లోని ప్రజా భవన్ బారికేడ్లను ఢీకొట్టిన ఘటనలో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకును తప్పించడానికి సహాయం చేశాడన్న ఆరోపణలపై బోధన్ సీఐ ప్రేమ్ కుమార్‌పై పంజాగుట్ట పీఎస్‌లో కేసు కూడా నమోదైంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న వంటి పోలీసు ఉన్నతాధికారులు జైలుపాలయ్యారు. ఇంకా అనేక మంది విచారణను ఎదుర్కొంటున్నారు.

#### సరైన చర్యలు తీసుకోకపోవడంతో

ఖాకీ డ్రెస్సులో కొందరు పోలీసులు దౌర్జన్యాలు, దందాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సివిల్ తగాదాల్లో, రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో తలదూర్చుతున్నారనే ఫిర్యాదులు అందుతున్నాయి. కొందరు పోలీసులు అక్రమార్కులకు వత్తాసు పలుకుతూ సెటిల్ మెంట్లు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అయితే అలాంటి పోలీసులపై డిపార్ట్ మెంట్ ఉన్నతాధికారులు నామమాత్రపు చర్యలతోనే సరిపెడుతుండడంతో వారు మరింత రెచ్చిపోతున్నారనే విమర్శలున్నాయి.

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ లో చిరుతపులి కలకలం




రంగారెడ్డి, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): శంషాబాద్ విమానాశ్రయంలో చిరుతపులి సంచారం కలకలం సృష్టిస్తోంది. ఆదివారం తెల్లవారుజామున విమానాశ్రయ పెట్రోలింగ్ సిబ్బంది రన్‌వేపై చిరుతను గుర్తించారు. ఈ క్రమంలో శంషాబాద్ ఎయిర్ పోర్ట్ రన్ వే పై ఆపరేషన్ చిరుత కొనసాగించారు. వన్యప్రాణి విభాగం సిబ్బంది, జూ అధికారులు చిరుత కోసం అక్కడి పరిసర ప్రాంతాల్లో వెతుకుతున్నారు. తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపల్లి వద్ద చిరుత ఎయిర్ పోర్ట్ ప్రహరీ నుండి దూకడం చిరుతతో పాటు రెండు చిరుత పిల్లలు కూడా సంచరిస్తున్నట్లు ఎయిర్‌పోర్ట్ అధికారులు గుర్తించారు. ఎయిర్ పోర్ట్ ప్రహరీ దూకుతుండగా ఫెన్సింగ్ వైర్లకు చిరుత తగలడంతో ఎయిర్ పోర్ట్ కంట్రోల్ రూమ్ లో అలారం మోగడంతో కంట్రోల్ రూమ్ సెక్యూరిటీ అధికారులు అప్రమత్తమయ్యారు. సీసీ కెమెరాలను పరిశీలించడంతో చిరుత సంచరించినట్లు గుర్తించారు. చిరుతతో పాటు రెండు చిరుత పిల్లలు ఉన్నట్లు కెమెరాలో రికార్డు అయ్యింది. అటవిశాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఎయిర్ పోర్ట్ లోకి చేరుకున్న అటవిశాఖ అధికారులు చిరుతను బంధించేందుకు ఏర్పాటులో పడ్డారు. చిరుత కదలికలను పరిశీలించేందుకు సీసీ కెమెరాలు, బోన్ లు ఏర్పాటు చేశారు అటవీశాఖ అధికారులు. దాదాపు మూడేళ్ల క్రితం చిరుతపులి విమానాశ్రయం గోడపై నుంచి దూకిన ఘటన అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డయింది. చిరుత విమానాశ్రయం గోడ దూకి గోల్కొండ, బహదూర్ గూడ వైపు వెళుతున్నట్లు కనిపించింది. కాగా ఇప్పుడు మరోమారు శంషాబాద్ ఎయిర్‌పోర్టు పరిసరాల్లో చిరుత సంచారం ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది.

## రిజర్వేషన్లపై బీజేపీ స్పష్టమైన ప్రకటన చేయాలి

### అగ్రకుల అహంకారం ఈ పాలకులకు ఉందని ఆరోపణలు

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్



తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లపై స్పష్టమైన ప్రకటన చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ కాచిగూడాలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రధాని మోడీ పదేళ్లుగా అధికారంలో ఉండి బీసీలకు ఒక్క పథకం కూడా తీసుకురాలేదని ధ్వజమెత్తారు. ఈ దేశంలోని బీసీలంతా కులవృత్తులలోనే ఉండాలనే బానిస మనస్తత్వం, అగ్రకుల అహంకారం ఈ పాలకులకు ఉందని ఆరోపించారు. ఇది మార్చుకోవాలని హెచ్చరించారు. బీసీలంటే బిచ్చగాళ్లు కాదని తాము ఈదేశంలో వాటా దారులమన్నారు.

## నిజజీవితంలో ఓ బాలుడు సాహసాన్ని అభినందించిన సీఎం

### మొదటి పేజీ తరువాయి

సాహసం అందరినీ ఆశ్చర్యచకితులను చేసింది అంతేకాదు ఆ బాలుని ప్రతి ఒక్కరూ అభినందించారు. ముఖ్యంగా సీఎం ఆ బాలుడిని తన వద్దకు పిలిపించుకొని అభినందించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నందిగామ శివారులోని ఓ ఫార్మా పరిశ్రమలో శుక్రవారం నాడు భారీ అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదం నుంచి 50 మంది కార్మికులు ప్రాణాలతో బయట పడేందుకు సహకరించిన బాలుడు సాయి చరణ్‌ను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. ఫార్మా కంపెనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో ధైర్య సాహసాలు ప్రదర్శించి ప్రమాదకర పరిస్థితిలో ఉన్న ఆరుగురు కార్మికుల ప్రాణాలను తాడు సాయంతో కాపాడిన సాయిచరణ్ ను సీఎం రేవంత్ ప్రత్యేకంగా అభినందించడంతో పాటు శాలువ కప్పి, పుష్ప గుచ్ఛం అందించి మెచ్చుకున్నారు. తల్లిదండ్రులతో కలిసి సాయిచరణ్ సీఎంను కలిశారు. కార్మికులను కాపాడటంలో ప్రదర్శించిన తెగింపు వివరాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. నందిగామకు చెందిన సాయిచరణ్ ఇటీవలే పదో తరగతి పూర్తి చేశాడు. అగ్ని ప్రమాదం వార్త తెలియగానే తన స్నేహితుడి తల్లి అదే పరిశ్రమలో పనిచేస్తుండడంతో సాయిచరణ్ అక్కడికి చేరుకున్నాడు. నాలుగో అంతస్తులో చిక్కుకున్న కొందరిని రక్షించాడు. అతడు చూపిన ధైర్యసాహసాలకు ఎమ్మెల్యే వీరపల్లి శంకర్, డీసీపీ నారాయణరెడ్డి అభినందించారు.

## బంగారు తెలంగాణ అన్నాడు.. నిరుద్యోగ తెలంగాణ చేశాడు


### మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డం వంశీ కృష్ణ మాట్లాడుతూ కేసీఆర్, పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వలేదు కానీ, తను మాత్రం వందల ఎకరాల ఫాం హౌస్ కట్టుకున్నారని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేదు.. కానీ, కేసీఆర్ ఇంట్లో నాలుగు ఉద్యోగాలు తీసుకున్నారని చెప్పారు. తన బిడ్డ కవిత ఓడిపోగానే ఎమ్మెల్సీ ఇచ్చారని మండిపడ్డారు. 10 సంవత్సరాలు మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ బుగ్గారం మండలానికి బస్ స్టాప్ తీసుకురాలేదని దుయ్యబట్టారు. బుగ్గారం ముత్యాల పోచమ్మ సాక్షిగా నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తానని వంశీ హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల ద్రోహి అని ఫైరయ్యారు. ఇక్కడి గోదావరి నీటిని.. సిద్దిపేట, గజ్వేల్ తరలించారని.. ఈ ప్రాంతంలో పంటలు ఎండుతుంటే గత ప్రభుత్వానికి కనబడలేదా? అని ప్రశ్నించారు. రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వమని.. రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తుందని చెప్పారు. మీ ఇంట్లో చిన్నకొడుకులా భావించి తనను ఆశీర్వదించి గెలిపించాలని వంశీకృష్ణ కోరారు.

## నల్గొండలో 11 కోట్ల విలువ గల నగదు, మద్యం, గంజాయి సీజ్

### ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిత్యం వాహన తనిఖీ

### మీడియాకు జిల్లా ఎస్పీ చందనా దీప్తి వెల్లడి




నల్గొండ, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): పార్లమెంట్ ఎన్నికల వేళ నల్గొండలో ఇప్పటివరకు భారీగా నగదు, మద్యం పట్టుపడినట్లు జిల్లా ఎస్పీ చందనా దీప్తి తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిత్యం నల్లగొండ జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీ నిర్వహించామని ఆమె చెప్పారు. ఈ క్రమంలో పెద్ద మొత్తంలో నగదు, మద్యం సీజ్ చేశామన్నారు. ఏప్రిల్ 28 ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 11 కోట్ల 7 లక్షల 41 వేల రూపాయల విలువ గల నగదు, మద్యం, గంజాయి, ఇతర వస్తువుల స్వాదీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అంతరాష్ట్ర సరిహద్దుల్లో నిఘా, సరిహద్దు ప్రాంతాలు వాడపల్లి, అడవిదేవులపల్లి టెయిల్ పాండ్, నాగార్జున సాగర్ అంతరాష్ట్ర ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర అధికారులతోనూ సమన్వయంతో పని చేస్తూన్నామన్నారు. అంతరాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ లకు అనుబంధంగా జాతీయ రహదారి 65 పై కేతపల్లి టోల్ ప్లాజా, చిట్యాల పోలీసు స్టేషన్ వట్టిమర్తి, మాల్, డిండి పోలీసు స్టేషన్ పరిదిలో ఇలా పలు ప్రాంతాల్లో అంతర్ జిల్లా సరిహద్దు చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేశామని చెప్పారామె. పారామిలిటరీ సిబ్బంది, ఇతర శాఖలకు చెందిన అధికారుల సహాయంతో జిల్లా అంతటా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.